

అభివృద్ధికి నోచుకోని నరసన్నపేట రాజుల చెరువు

అంతన్నారు.. ఇంతన్నారు





- అభివృద్ధికి నోచని నరసన్నపేట నియోజకవర్గం
- గాలిలో కలిసిన సీఎం జగన్ హామీలు
- ఎక్కడికక్కడ నిలిచిన అభివృద్ధి పనులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

నరసన్నపేటలో జమ్ము జంక్షన్ నుంచి సత్యవరం జంక్షన్ వరకు పట్టణ మెయిన్ రోడ్డు విస్తరణ చేపడతాం. దీంతోపాటు పూర్తిస్థాయిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.10కోట్లు ఇస్తాం. పట్టణ నడిబొడ్డున ఉన్న రాజులచెరువును పర్యాటకంగా తీర్చిదిద్దు తాం. ఇందుకోసం రూ.5కోట్లు కేటాయిస్తాం. సాగునీటి ఇబ్బందులు లేకుండా మడపాం ఎత్తిపోతల పథకానికి రూ.15 కోట్లు మంజూరు చేస్తాం. పోలాకి మండలంలో సుసరాం తుంపర భూముల సమస్య పరిష్కారానికి రూ.2 కోట్లు కేటాయిస్తాం. మొత్తంగా అభివృద్ధి పనులు చేపట్టి.. నరసన్నపేట నియోజకవర్గ రూపురేఖలు మారుస్తాం.

- ఇవీ 2022 నవంబరు 23న నరసన్నపేటలో సమగ్ర భూసర్వే రెండో విడత ప్రారంభం సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు సీఎం జగన్ ఇచ్చిన హామీలు.

వాస్తవ పరిస్థితి పరిశీలిస్తే.. ఇందులో ఒక్క హామీ కూడా నెరవేర లేదు. సీఎం జగన్ హామీలన్నీ ప్రకటనలకే పరిమితమయ్యాయని నరసన్నపేట నియోజక వర్గ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కూడా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో వైసీపీ నేతలకు తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టం చేస్తున్నారు.



నరసన్నపేటలో నిలిచిన రోడ్డు విస్తరణ పనులు



జలుమూరు మండలంలో నిలిచిన హరిక్రిష్ణమ్మపేట తాగునీటి పథకం

(నరసన్నపేట)

వైసీపీ పాలనలో నరసన్నపేట అభివృద్ధి మరింత కుంటుపడింది. 2022 నవంబరు 23న సీఎం జగన్ నరసన్నపేట రాగా.. నియోజకవర్గానికి వరాల జల్లు కురిపించారు. దీంతో ప్రజలు ఎంతో సంబరపడ్డారు. కానీ, ఏడాదిన్నరైనా సీఎం హామీలు కనీసస్థాయిలో అమలుకు నోచుకోలేదని విస్తుపోతున్నారు. ప్రధానంగా నరసన్నపేటలో రోడ్డు విస్తరణ పనులు పూర్తికాకపోవడంతో ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో సత్యవరం జంక్షన్ నుంచి జమ్ము జంక్షన్ వరకు పాత జాతీయ రహదారి (2.8కిలోమీటర్లు) విస్తరణకు ఆర్అండ్‌బీ శాఖ 2021 జూలై 9న ప్రణాళిక రూపొందించింది. అప్పట్లో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పల్లిపేట జంక్షన్ వరకు (1.1కిలోమీటరు) పనులు చేపట్టారు. అటు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సత్యవరం జంక్షన్ వరకు, ఇటు పల్లిపేట జంక్షన్ నుంచి జమ్ము జంక్షన్ వరకు (1.7 కిలోమీటర్లు) రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉంది. అప్పట్లో రోడ్డుకు ఇరువైపులా 80 అడుగుల వరకూ షాపులు తొలగించారు. కానీ విస్తరణ పనులు పూర్తికాలేదు. దీంతో రోడ్డే మీదే వ్యాపారాలు సాగుతూ.. ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

రాజుల చెరువు అభివృద్ధి అంతేనా..

నరసన్నపేటలోని రాజుల చెరువును పర్యాటకంగా తీర్చిదిద్దుతామన్న హామీ కూడా నెరవేరలేదు. గొట్టిపల్లి సర్వే నంబరు 219/1బిలో దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు ఆక్రమణకు గురై.. ప్రస్తుతం పట్టణ నడిబొడ్డున ఏడు ఎకరాల్లో మాత్రమే కనిపిస్తోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.40లక్షలు మంజూరు చేసి కొంతమేర పనులు చేపట్టారు. ఈలోగా ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి పనులు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ విజ్ఞప్తి మేరకు.. ఈ చెరువు అభివృద్ధికి రూ.5కోట్లు కేటాయిస్తామని సభా వేదికగా సీఎం జగన్ ప్రకటించారు. కానీ ఇంతవరకూ నిధుల ఊసేలేదు. మరోవైపు రాజుల చెరువును ఆనుకుని ఉన్న కాలేజీ రోడ్డు కూడా ఆక్రమణతో ఇరుకుగా మారింది. ప్రముఖుల పర్యటన సమయంలో ఈ రోడ్డుపై రాకపోకలు నిలిచిపోవాల్సిందే.

సాగునీరుకు తప్పని చింత..

- వంశధార నది చెంత ఉన్నా.. మడపాం బుచ్చిపేట, చేనులవలస, పోతయ్యవలస, గోపాలపెంట, మాకివలస, కిల్లాం తదితర గ్రామాల రైతులకు సాగునీటి ఇబ్బంది లు తప్పడం లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మడపాం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.7కోట్లతో ప్రతిపాదనలు పంపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రతిపాదనలు మూలనపడ్డాయి. ఎమ్మెల్యే కృష్ణదాస్ వద్ద రైతులు తమ సమస్యను మొరపెట్టుకోగా.. ఈ విషయాన్ని ఆయన సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎత్తిపోతల పథకం కోసం రూ.15కోట్లు మంజూరు చేస్తామని సీఎం జగన్ ప్రకటించారు. కానీ, ఇంతవరకూ నిధులు మంజూరు చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల వేళ.. అధికారపార్టీ నేతలు ఎత్తిపోతల పథకం గురించి మళ్లీ హామీలు గుప్పిస్తున్నారని పేర్కొంటు న్నారు. అలాగే వంశధార కాలువల్లో పూడికలు కూడా తొలగించకపోవడంతో రైతులే శ్రమదానం చేసి బాగుచేసుకుంటున్నారు.
- పోలాకి మండలం సుసరాం రైతులు తుంపర భూముల్లో చేరిన వరదనీటి ఏటా ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ హయాంలో పనులు చేపట్టగా కొంతమేర నిలిచిపోయాయి. 2019లో వరదల కారణంగా సుసరాం తుంపర భూములు నీటిలో మునిగాయి. ఈ సమస్య పరిష్కారానికి రూ.2కోట్లు మంజూరు చేస్తామని సీఎం జగన్ ప్రకటించారు. కానీ ఇంతవరకూ నిధులు మంజూరు కాక పనులు చేపట్టలేదని రైతులు వాపోతున్నారు.



ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో.. వంశధార కాలువను బాగుచేసుకుంటున్న రైతులు (ఫైల్)

అంతా సమస్యలమయం

- పోలాకి మండలంలో డోల, పిన్నింటిపేట, మబుగాం- వనితమండలం రోడ్డు, తోటాడ-గొల్లలవలస తదితర రహదారులు గోతులమయంగా మారాయి. ఈ ఐదేళ్లలో కనీస మరమ్మతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే మండలంలో ఆరు అంగన్‌వాడీ కేంద్రాల భవనాల పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అలాగే 23 సచివాలయాలకు గానూ.. ఏడు భవనాలకు సంబంధించి కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో వాటిని అప్పగించలేదు.
- జలుమూరు, సారవకోట మండలాల్లో 93 గ్రామాలకు తాగునీరు అందించాలనే లక్ష్యంగా టీడీపీ హయాంలో మంత్రి హోదాలో నారా లోకేశ్ 2017 డిసెంబరులో శ్రీముఖలింగం తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. తొలివిడతలో రూ.28 కోట్లతో రెండు మండలాల్లో 47 గ్రామాలకు తాగునీరు అందించారు. రెండో విడతలో రూ.20కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఈలోగా 2019లో ప్రభుత్వం మారింది. నిధులు విడుదల చేసినా.. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో జాప్యంతో జలుమూరు మండలంలో రావిపాడు, హరిక్రిష్ణమ్మపేట, పెద్దదూగాం, దరివాడ, చిన్ననామాలపేట తదితర 18 గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయి. సారవకోట మండలంలో సారవకోట, పద్మపురంతో పాటు మొత్తంగా 17 గ్రామాల్లో నీటి ట్యాంకులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు.
- శ్రీముఖలింగేశ్వరం ఆలయ అభివృద్ధికి రూ.55కోట్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ హామీ ఇచ్చారు. ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు. గత ప్రభుత్వ హయాంలో మాస్టర్ ప్లాన్ కింద చేపట్టిన మాడవీధుల పనులు ముందుకు సాగలేదు.
- జలూమరు మండల కేంద్రం నుంచి సుబ్రహ్మణ్యపురం మీదుగా బుడితి వరకు టీడీపీ హయాంలో 2018 పనులు చేపట్టారు. ప్రభుత్వం మారడంతో నిధులు విదల్చక పనులు నిలిచిపోయాయి.
- సారవకోట మండలం వడ్డినవలస నుంచి జలుమూరు మండలం కరకవలస వరకు రోడ్డు నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరయ్యాయి. బిల్లులు చెల్లించక పనులు నత్తనడకన సాగుతున్నాయి.
- సారవకోట మండలం బైదాలపురం వద్ద వంశధార ఎడమ కాలువపై వంతెన 2020లో కూలిపోయింది. వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.33 కోట్లు మంజూరు చేసింది. నేటికి టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదు.
- అలుదు నుంచి వయా పద్మపురం, జమచక్రం మీదుగా పాకివలస వరకు ఉన్న రోడ్డుకు రూ.15కోట్లు మంజూరు కాగా సకాలంలో చెల్లింపులు లేక పనులు నిలిచిపోయాయి.


మరింత దారుణం



పట్టణాభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నట్టు సీఎం జగన్ ప్రకటించడంతో ఎంతో సంబరపడ్డాం. కానీ ఇంతవరకూ ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదు. మెయిన్ రోడ్డు మరింత దారుణంగా తయారైయింది.

-గొద్దు చిట్టిబాబు, మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్, నరసన్నపేట

తాగు.. సాగునీరు లేదు



పోలాకి మండలంలో చాలా గ్రామాలకు సాగునీరు అందక పంటలు పోతున్నాయి. రెండేళ్లుగా ఊబాలు కావడంలేదు. అధికార పార్టీ నాయకులు పట్టించుకోవడం లేదు. వనిత మండలం రక్షితనీటి పథకం లోపాలతో తాగునీరు కూడా సక్రమంగా అందడం లేదు. ఇక గొల్లవలస రోడ్డు మీద ప్రయాణం నరకంగా ఉంది.

- సూరపు నారాయణదాసు, సంతలక్ష్మీపురం, పోలాకి

సీఎం మాటలు బూటకమే



మడపాం ఎత్తపోతల పథకం ద్వారా సాగునీరు అందుతుందని ఆశించాం. సీఎం జగన్మోహన్‌రెడ్డి మాటలు అంతా బూటకమే. వైసీపీ పాలనలో సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు.

- యాళ్ల వేణుగోపాలరావు, రైతు, మాకివలస, నరసన్నపేట

అభివృద్ధి జాడలేవీ



ఐదేళ్లుగా సారవకోట మండలంలో అభివృద్ధి జాడ కనిపించలేదు. తాగునీటి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రహదారులకు కనీస మరమ్మతులు చేపట్టడం లేదు.

-గొండు బాబూరావు, బుడితి, సారవకోట

తాగునీరు అందించండి



తాగునీటి కోసం పొలాల్లో ఉన్న బావి దగ్గరకు వెళ్లాల్సి వస్తోంది. గ్రామాల్లో తాగునీటి పైపులు వేసినా రోజూ నీటి సరఫరా చేయడం లేదు. దీంతో ఇబ్బంది పడుతున్నాం. రోజూ ఇంటింటా తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలి.

- గురుగుబెల్లి ఝాన్సీ, హుస్సేన్‌పురం, జలుమూరు

మూడోరోజు.. నామినేషన్లు

- నరసన్నపేట టీడీపీ అభ్యర్థిగా బగ్గు రమణమూర్తి దాఖలు

శ్రీకాకుళం,ఆంధ్రజ్యోతి/ నరసన్నపేట, ఏప్రిల్ 20: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో మూడోరోజు శనివారం కూడా పలువురు నామినేషన్లు వేశారు. కేవలం ఇచ్ఛాపురం, నరసన్నపేట, ఆమదాలవలస, శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గాలకు మాత్రమే నామినేషన్లు దాఖలయ్యాయి. నరసన్నపేటలో కూటమి టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి నామినేషన్ వేశారు. ఆయనతో పాటు సతీమణి బగ్గు సుగుణ కూడా రెండు సెట్ల నామినేషన్లను ఆర్వో జీవీవీఎస్ రామ్మోహన్‌రావుకు అందజేశారు. తొలుత బగ్గు దంపతులిద్దరూ మబుగాంలో తూర్పు అమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి మబగాం నుంచి ర్యాలీగా నరసన్నపేట చేరుకున్నారు. పైడితల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. పట్టణంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి నామినేషన్‌కు తరలివెళ్లారు. తనను ఆశీర్వదించి.. ఎన్నికల్లో గెలిపిస్తే నరసన్నపేట నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బగ్గు రమణమూర్తి తెలిపారు. అలాగే ఇచ్ఛాపురం నుంచి సుగ్గు చక్రవర్తి(ఇండిపెండెంట్), శ్రీకాకుళం నుంచి రాగోలు నాగశివ(జైభారత్ నేషనల్ పార్టీ), ఆమదాలవలస నుంచి సీపాన శ్రీనివాసరావు(భారత చైతన్య యువజన పార్టీ), బురిడి గౌరీ శంకర్(జై భారత్ నేషనల్ పార్టీ) నామినేషన్ దాఖలు చేశారు.



ఆర్వో రామ్మోహన్‌రావుకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బగ్గు రమణమూర్తి

రూ.2.25 లక్షలు సీజ్

పలాసరూరల్/మందస, ఏప్రిల్ 20: మందసలో శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. షేక్‌మదీనా అనే మహిళ వద్ద రూ.2.25 లక్షలు లభ్యమైంది. నగదుకు సంబంధించి రశీదు చూపకపోవడంతో.. సీజ్‌చేసి పాతపట్నం ట్రెజరీకి తరలించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి భరత్‌నాయక్ తెలిపారు.

మీరు చేసిన అభివృద్ధి ఏమిటి?

- ఎన్నికల ప్రచారంలో మంత్రి సీదిరికి మాజీ కౌన్సిలర్ నిలదీత
- ప్రశ్నించిన వ్యక్తిని పక్కకు నెట్టేసిన అప్పలరాజు అనుచరులు
- ఇది ముమ్మాటికీ దాడేనన్న టీడీపీ వర్గీయులు



ధనుంజయ్‌కు సంఘీభావం ప్రకటించిన టీడీపీ నాయకులు



ధనుంజయ్‌ను నెట్టేస్తున్న వైసీపీ కార్యకర్తలు

పలాస, ఏప్రిల్ 20: ఎన్నికల ప్రచారంలో మంత్రి సీదిరి అప్పలరాజుకు చేదు అనుభవం ఎదురైంది. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని ఆరోవార్డు పెసరపాడులో శనివారం సాయంత్రం ఆయన పర్యటించారు. కాగా.. పెసరపాడు గ్రామంలో మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని మాజీ కౌన్సిలర్ సంపతిరావు ధనుంజయ్ మంత్రి అప్పలరాజును నిలదీశారు. దీంతో మంత్రి అనుచరులు కలుగజేసుకుని.. ఆయనను పక్కకు తోసేయడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మంత్రి అప్పలరాజు చైర్మన్ బళ్ల గిరిబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆరో వార్డులో శనివారం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల వైసీపీని వీడి టీడీపీలో చేరిన మాజీ కౌన్సిలర్ సంపతిరావు ధనుంజయ్ ఇంటి వద్ద ఎన్నికల ప్రచార రథాన్ని నిలిపి పాటలు వేశారు. ఈ నేపథ్యంలో పెసరపాడు గ్రామానికి చేసిన అభివృద్ధి ఏమిటని, ప్రచారానికి అర్హత లేదని ఆయన మంత్రిని ప్రశ్నించారు. రోడ్డు వేయలేని దుస్థితిలో ఉన్నారని, అంగన్‌వాడీ పోస్టులను అమ్ముకున్నారని ఆరోపించారు. అభివృద్ధి చేయలేదని తెలుసు కనుకే.. మంత్రి ప్రచారానికి చైర్మన్ బళ్ల గిరిబాబు కూడా రాలేదని విమర్శించారు. దీంతో మంత్రితో పాటు ఆయన అనుచరులు ధనుంజయ్‌ను పక్కకు నెట్టేశారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన నీకు అభివృద్ధిపై మాట్లాడే అర్హత లేదన్నారు. ఈ క్రమంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొనగా.. గ్రామస్థులు, పోలీసులు కలుగజేసుకొని శాంతింపజేశారు. ఈ ఘటన నేపథ్యంలో అక్కడికి టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, దువ్వాడ శ్రీకాంత్ చేరుకొని ధనుంజయ్‌కు సంఘీభావం తెలిపారు. ఈ దాడి ముమ్మాటికీ కాళింగ కులాన్ని అణచివేసే చర్య అని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తాము ఇటీవల కాళింగ కుల ఆత్మీయ సమావేశం నిర్వహించామని, ఈ కారణంగానే మంత్రి అప్పలరాజు సహనం కోల్పోయి ధనుంజయ్‌పై దాడికి యత్నించారని ఆరోపించారు. ఈ సంఘటనపై పలాస టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష ధనుంజయ్‌కు ఫోన్ చేసి ధైర్యంగా ఉండాలని, తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధితుడు ధనుంజయ్‌కు సప్ప నవీన్, మల్లా శ్రీనివాస్ తదితరులు మద్దతు తెలిపారు.

ప్రచార ఖర్చులపై నిరంతర నిఘా


- వ్యయ పరిశీలకులు నీనా నిగమ్

కలెక్టరేట్, ఏప్రిల్ 20: ఎన్నికల ప్రచారానికి సంబంధించి అభ్యర్థుల ఖర్చులపై నిరంతరం నిఘా ఉంచాలని ఎన్నికల వ్యయ ప్రత్యేక పరిశీలకులు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి నీనా నిగమ్.. నోడల్ ఏజెన్సీ అధికారులకు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజకీయ పార్టీల అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ, సాధారణ ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. ఇతర ఎన్నికల పరిశీలకులు కోమల్‌జిత్ మీనా, శరవణకుమార్, నవీన్‌కుమార్ సోనీతో కలిసి ఆమె మాట్లాడారు. ఓటర్లకు నగదు, బహుమతుల పంపిణీపై సీ-విజిల్ ద్వారా ఫిర్యాదు చేసేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు.

- ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్.. జిల్లాలో వ్యయ పర్యవేక్షణ బృందాల పనితీరు, రాజకీయ ప్రచారానికి అనుమతులు, ఎన్నికల నిర్వహణ ప్రణాళిక, తదితర అంశాలను వివరించారు. ఎస్పీ జీఆర్ రాధిక మాట్లాడుతూ ఎన్నికలకు భద్రతా ఏర్పాట్లు, సరిహద్దుల్లో చెక్‌పోస్టుల పనితీరు, సీజ్ చేసిన నగదు, మద్యం, బంగారం, గంజాయి వివరాలు వెల్లడించారు.
- ఇదిలా ఉండగా ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులంతా నూతన కలెక్టరేట్ సముదాయంలోని ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. మీడియా మోనటరింగ్, మోడల్ కోడ్ కమిటీ, సోషల్ మీడియా తదితర విభాగాలను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి రిజిస్టర్లు తనిఖీ చేశారు. సమావేశంలో ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో ఎం.గణపతిరావు, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రాణీ మోహన్, సీసీవో ప్రసన్నలక్ష్మి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, సమాచార పౌరసంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు నీనా నిగమ్



23న చంద్రబాబు పర్యటన

- పాతపట్నం, ఆమదాలవలసలో ప్రజాగళం సభలు
- మరుసటి రోజు మహిళలతో భేటీ


(శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/ ఆమదాలవలస/ పాతపట్నం)

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 23న జిల్లాకు రానున్నారు. ప్రజాగళం పేరిట అన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల సభలు నిర్వహిస్తున్న సంగతి విదితమే. ఈ క్రమంలో ఈ నెల 15న పలాసలో నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన పాల్గొన్నారు. తొమ్మిది రోజుల వ్యవధిలోనే జిల్లాకు మరోసారి వస్తున్నారు. 23న మధ్యాహ్నం 3గంటలకు పాతపట్నంలో, రాత్రి ఏడు గంటలకు ఆమదాలవలసలో ప్రజాగళం సభలు నిర్వహిస్తారు. అనంతరం రాత్రి శ్రీకాకుళం జిల్లా టీడీపీ కార్యాలయంలో బస చేస్తారు. మరుసటి రోజు 24న జిల్లాలో మహిళా కార్యకర్తలు, డ్వాక్రా మహిళలతో సమావేశమవుతారు. ఈ మేరకు చంద్రబాబు పర్యటనకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని ఆమదాలవలస, పాతపట్నం టీడీపీ అభ్యర్థులు కూన రవికుమార్, మామిడి గోవిందరావు పిలుపునిచ్చారు.

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో రాజకీయాలు ఒక ఎత్తయితే పలాస నియోజకవర్గంలో పాలిటిక్స్ మరో ఎత్తు. ప్రస్తుతం టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష, వైసీపీ అభ్యర్థి సీదిరి అప్పలరాజు మధ్య ఢీ అంటే ఢీ అన్న విధంగా రాజకీయం నడుస్తోంది. ప్రస్తుతం రెండు పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమన్న పరిస్థితి ఉంది. భౌతిక దాడులు, జేసీబీలతో దాడులు, సోషల్‌మీడియాలో దాడులు, మాటకు మాట, ప్రతిసవాళ్లతో పలాస రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. ప్రస్తుతం ఇక్కడ టీడీపీ బలంగా ఉంది. శిరీష నిత్యం ప్రజల్లో ఉంటుండడం పార్టీకి కలిసొచ్చే అంశం. మంత్రి సీదిరిపై సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత ఉంది. ఆయన తీరు నచ్చక చాలామంది టీడీపీలో చేరారు. ఈ పరిస్థితులన్నీ టీడీపీకి అనుకూలంగా ఉన్నాయి. చూడాలి మరి.. ఈ ఎన్నికల్లో ఓటర్లు ఎవరికి పట్టం కడతారో.

- ఒకసారి గెలిచిన వారు రెండోసారి గెలవలే
- విలక్షణ తీర్పు ఇస్తున్న ఓటర్లు
- ఈసారి బరిలోకి దిగుతున్న శిరీష, సీదిరి
- బలంగా తెలుగుదేశం పార్టీ
- మంత్రిపై సొంత పార్టీలోనే వ్యతిరేకత

పలాస బాద్‌షా ఎవరో?


పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ..


గౌతు శిరీష


గౌతు శ్యామసుందరశివాజీ


డాక్టర్ సీదిరి అప్పలరాజు


జుత్తు జగన్నాయకులు


వజ్జ బాబూరావు



(పలాస)

పలాస అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడి నాలుగోసారి ఎన్నికలకు సిద్ధమయ్యింది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీగా ఉండే ఈ ప్రాంతం భౌగోళికంగా పెద్దది కావడంతో పలాస నియోజకవర్గ ఆవశ్యకత ఏర్పడింది. తొలుత పలాస సోంపేట నియోజక వర్గంలో, కాశీబుగ్గ టెక్కలి నియోజకవర్గంలో ఉండేవి. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా పలాస కొత్త నియోజక వర్గంగా అవతరించింది. పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాలతో పాటు పలాస-కాశీబుగ్గ పురపాలకసంఘం కలిసి పలాస నియోజకవర్గంగా ప్రస్తుతం ఉంది. తెల్లబంగారం(జీడిపప్పు), కొబ్బరికి ప్రసిద్ధి చెందిన పలాస నియోజకవర్గంలో ప్రజలు ఇప్పటి వరకూ జరిగిన మూడు ఎన్నికల్లో భిన్నమైన తీర్పు ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009 సంవత్సరంలో పలాసకు మొదటిసారి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి గౌతు శ్యామసుందరశివాజీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా జుత్తు జగన్నాయకులు పోటీ పడ్డారు. ఈ ఎన్నికల్లో శివాజీ అనూహ్య రీతిలో ఓటమిపాలయ్యారు. ఆరు వేల ఓట్ల తేడాతో జగన్నాయకులు విజయం సాధించారు. తరువాత తెలంగాణ విడిపోయిన తరువాత 2014లో మొదటిసారిగా జరిగిన ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున పలాస-కాశీబుగ్గ మాజీ మున్సిపల్ ఛైర్మన్ వజ్జ బాబూరావు, తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గౌతు శ్యామసుందరశివాజీ పోటీ పడ్డారు. గౌతు శివాజీ 17వేలకు పైగా ఓట్ల మెజార్టీ సాధించి టీడీపీకి గట్టిపట్టు ఉందని నిరూపించారు. 2019 ఎన్నికల్లో గౌతు శివాజీ తన కుమార్తె గౌతు శిరీషను పోటీలో నిలబెట్టారు. వైసీపీ నుంచి ప్రముఖ వైద్యుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు బరిలోకి దిగారు. రాష్ట్రంలో జరిగిన రాజకీయ సమీకరణలు, వైసీపీ ఒక్కఛాన్స్‌లో భాగంగా సీదిరి అప్పలరాజు 16వేల ఓట్లతో గెలుపొందడంతో పాటు అనూహ్యంగా రాష్ట్ర మంత్రివర్గంలో చోటుసంపాదించుకున్నారు. మొత్తం మూడు ఎన్నికలు పరిశీలిస్తే మొదటి ఎన్నికల్లో జుత్తు జగన్నాయకులు, రెండో ఎన్నికల్లో గౌతు శ్యామసుందరశివాజి, మూడో ఎన్నికల్లో డాక్టర్ సీదిరి అప్పలరాజులు గెలుపొందారు. ఒకసారి గెలిచిన వారు రెండోసారి గెలవలేదు. మొదటి ఎన్నికల్లో పోటీ చేసిన జగన్నాయకులకు రెండోదఫా ఎన్నికల్లో టిక్కెట్ రాకపోవడం, తరువాత ఆయన మరణించారు. వైసీపీ నుంచి బరిలో ఉన్న వజ్జ బాబూరావు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. గౌతు శివాజి తన రాజకీయ వారసురాలిగా గౌతు శిరీషను బరిలోకి దించి ఆయన రాజకీయాలను తాత్కాలికంగా విరమించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో కూడా టీడీపీ నుంచి గౌతు శిరీష రెండోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకుంటుండగా, డాక్టర్ సీదిరి అప్పలరాజు ఉన్న పదవిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే పలాసలో మాత్రం ఇప్పటి వరకూ జరిగిన ఎన్నికలు పరిశీలిస్తే ఒక్కఛాన్స్ మాత్రమే అభ్యర్థులకు ఓటర్లు ఇచ్చారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఎటువంటి ఫలితాలు ఇస్తారోనని రాజకీయ పరిశీలకులు ఆసక్తితో చూస్తున్నారు.

పలాస ఎమ్మెల్యేలు	సంవత్సరం
జుత్తు జగన్నాయకులు	2009
గౌతు శ్యామసుందరశివాజీ	2014
డాక్టర్ సీదిరి అప్పలరాజు	2019

మత్స్యకార సామాజిక వర్గానిదే ఆధిపత్యం..

పలాస నియోజకవర్గంలో పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాలతో పాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అంతర్భాగంగా ఉంది. వజ్రపుకొత్తూరు, మందస మండలంలో మత్స్యకార సామాజికవర్గానికి చెందిన వారు అధికంగా ఉన్నారు. ఈ సామాజిక వర్గంలో అగ్నికుల క్షత్రియ, వాడబలిజ, జాలారి కులాలకు సంబంధించి 50వేల పైచిలుకు ఓట్లు ఉన్నాయి. తరువాత కాళింగులు 40 వేలు, యాదవ 25 వేలు, కళింగవైశ్య 15 వేలు, తూర్పుకాపు 22వేలు, శ్రీశయన 8వేలు, ఎస్టీ 12వేలు, ఎస్సీ 12 వేలు, మిగిలిన ఇతర కులాల ఓట్లు ఉన్నాయి. నియోజకవర్గం పునర్విభజన తరువాత మొదటిసారిగా మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన జుత్తు జగన్నాయకులు(కాంగ్రెస్) టీడీపీ అభ్యర్థి గౌతు శివాజి(శ్రీశయన)పై గెలుపొందగా, తరువాత శివాజి కాళింగ కులానికి చెందిన వజ్జ బాబూరావు (వైసీపీ)పై గెలుపొందారు. తరువాత శివాజి కుమార్తె శిరీషపై మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సీదిరి అప్పలరాజు (వైసీపీ) గెలుపొందారు.

ఎవరు గెలిచినా రికార్డే..

పలాస నియోజకవర్గంలో ప్రస్తుత ఎన్నికల్లో ఎవరు గెలిచినా రికార్డుగా మిగిలిపోతుంది. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్, 2014 ఎన్నికల్లో తెలుగుదేశం, 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు. ఒకరికి ఒక్కఛాన్స్ మాత్రమే పలాస ప్రజలు ఇప్పటి వరకూ ఇచ్చారు. ప్రస్తుతం ఎమ్మెల్యే, మంత్రిగా కొనసాగుతున్న సీదిరి అప్పలరాజు గెలుపొందితే రెండుమారు గెలిచిన చరిత్ర మిగులుతుంది. టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష గెలుపొందితే చరిత్ర పునరావృతం అవుతుంది. ఈ ఇద్దరిలో ఎవరికి ప్రజలు విజయం కట్టబెడతారో చూడాలి.

నియోజకవర్గంలో ఓటర్లు..

	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
పలాస	40,521	42,667	12	83,210
మందస	33,883	34,809	12	68,704
వజ్రపుకొత్తూరు	32,413	33,879	2	66,294
మొత్తం	1,06,817	1,11,365	26	2,18,208

వైసీపీని వీడుతున్న నేతలు..

పలాస వైసీపీలో ప్రస్తుతం ముసలం ఏర్పడింది. ఐదేళ్ల పాటు తనకు తిరుగులేదని, ప్రత్యర్థులకు పరుగులు పెట్టించానని, పలాసలో ఎనలేని అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పుకుంటున్న మంత్రి సీదిరి అప్పలరాజుపై పార్టీ నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆయన వెంట ఉన్న నాయకులంతా ఒక్కక్కొరుగా తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. గతంలో ఆయన గెలుపుకోసం పనిచేసిన నాయకులు ఎవ్వరూ ప్రస్తుతం పార్టీలో లేరు. దువ్వాడ శ్రీకాంత్, కొర్ల కన్నారావు, దువ్వాడ హేమబాబుచౌదరి, వి.మాధవరావు, తలగాన నర్సింహమూర్తి, జుత్తు నీలకంఠం, వరిశ హరిప్రసాద్, దువ్వాడ శ్రీధర్ వంటివారు పార్టీ బయటకు వచ్చి టీడీపీకి ప్రచారం చేస్తున్నారు. మిగతా ముఖ్య నాయకులు పూర్తిగా మౌనం దాల్చడంతో వైసీపీ కేడర్ తలలు పట్టుకుంటుంది. అయితే, మంత్రి మాత్రం తనకు ప్రజలే వెన్నుదన్ను అని చెప్పుకుని తిరుగుతున్నారు.

దూకుడుగా శిరీష..

సిక్కోలు శివంగిగా గుర్తింపు ఉన్న గౌతు శిరీష టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. మంత్రి అప్పలరాజును ఢీకొట్టే విషయంలో దూకుడుగా వ్యవహరిస్తున్నారు. తాత సర్దార్ గౌతు లచ్చన్న, తండ్రి గౌతు శ్యామసుందరశివాజి వారసత్వాన్ని అందిపుచ్చుకొన్న ఆమె ఈ ఎన్నికల్లో ఎలాగైనా అప్పలరాజును ఓడించి అసెంబ్లీలో స్థానం దక్కించుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పలాస నియోజకవర్గంలో గౌతు కుటుంబానికి ప్రత్యేక ఓటు బ్యాంకు ఉంది. దీనికితోడు ప్రస్తుతం ఇక్కడ టీడీపీ బలంగా ఉంది. గత తప్పులు పునరావృతం కాకుండా వైసీపీ ఓటమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. ప్రశాంతమైన పలాసలో రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులు, దౌర్జన్యాలు, రౌడీయిజం ప్రదర్శించే స్థాయికి వైసీపీ నాయకులు తీసుకువచ్చారు. దీన్నే ఆమె ప్రచారాస్త్రంగా మార్చుకుని ప్రజల్లోకి వెళ్తున్నారు.

మీకు తెలుసా!

డిపాజిట్ గల్లంతంటే ఏంటి?

(నరసన్నపేట)




ఎన్నికల్లో అభ్యర్థులు ప్రత్యర్థులకు డిపాజిట్ కూడా రాదని చెబుతుంటారు. మరి డిపాజిట్ గల్లంతు అంటే ఏంటీ? డిపాజిట్‌కు అవసరమైన ఓట్లు రాకపోతే ఏం జరుగుతుంది. ఎన్నికల ఫలితాల ప్రకటించిన సమయంలో అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలను అధికారులు ప్రకటిస్తారు. ఆ సమయంలో డిపాజిట్‌కు అవసరమైన ఓట్లు కూడా అభ్యర్థికి రాలేదని వింటాం. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ ఫారంతో పాటు నిర్ణీత డిపాజిట్ (ధరావతు) చెల్లించాల్సి ఉంటుంది. జనరల్ అభ్యర్థులు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.ఐదు వేలు చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా ఎన్నికల్లో పోలైనవాటిలో చెల్లిన ఓట్లలో ఆరో వంతుకు మించితే ఆ అభ్యర్థి చెల్లించిన డిపాజిట్‌ను తిరిగి చెల్లిస్తారు. లేకుంటే ఆ డిపాజిట్‌ను ఎన్నికల సంఘమే జప్తు చేసుకుంటుంది. ఎన్నికల ఫలితాలు రాష్ట్ర ప్రభుత్వ గెజిట్‌లో ప్రచురితం చేసిన తర్వాత మాత్రమే అర్హులైన అభ్యర్థులకు డిపాజిట్‌ను తిరిగి ఇచ్చేస్తారు.

ఆ బ్యాలెట్‌లో గుర్తులుండవ్..!



హిరమండలం: గుర్తులు లేకుండా ఎన్నికలు ఏంటా అని సందేహం రావొచ్చు. అవును నిజమే.. పోస్టల్ బ్యాలెట్‌లో పార్టీ గుర్తులు ఉండవు. కేవలం అభ్యర్థి, పార్టీ పేర్లు మాత్రమే ఉంటాయి. ఎన్నికల రోజు విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, ప్రైవేట్ వ్యక్తులు వేసే ఓటే పోస్టల్ బ్యాలెట్. ఇంతకుముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగే సమయంలో సాధారణ ఓటర్లకు ఇచ్చే బ్యాలెట్ పత్రాన్ని ఉద్యోగులకూ ఇచ్చే వారు. వచ్చిన వాటిల్లో చివరి వాటిని తీసి పోస్టల్ ఓటు వేసే ఉద్యోగులకు అందజేసేవారు. ఈవీఎం యంత్రాలు వచ్చిన తర్వాత ఉద్యోగులు, ప్రైవేట్ వ్యక్తులు యంత్రంలో ఓటువేసే పరిస్థితి లేకపోవడంతో పోస్టల్ బ్యాలెట్‌ను ఏర్పాటుచేశారు. దీన్ని బట్టి వారి ప్రాంతాల్లో పోటీచేసే అభ్యర్థి పేరు, పార్టీ పేరు ముద్రిస్తారు. గుర్తు ఉండకపోవడంతో అభ్యర్థి పేరు పక్కన టిక్ పెట్టాల్సి ఉంటుంది.


పోలింగ్ బూత్‌లో 1400 ఓట్లే ఎందుకు?



గార: ఒక్కో పోలింగ్ బూత్‌లో గరిష్ఠంగా 1400 మంది ఓటర్లు ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేస్తారు. ఇలా ఎందుకు చేస్తారో తెలుసా? ప్రతి బూత్‌లో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లు ఈ మూడు ఒకదానికొకటి అనుసంధానంగా పనిచేస్తాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లకు అనుసంధానంగా ఉండే వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫైబుల్ పేపర్ అండ్ ట్రయల్)లో కాగితాన్ని పొందుపరుస్తారు. అది 1450 స్లిప్పులను మాత్రమే ముద్రిస్తుంది. బ్యాటరీతో పని చేసే వీవీ ప్యాట్‌లోని డిస్‌ప్లేలో ఓటు ఎవరికి వేశామన్నది కనిపిస్తుంది. అందులో 50 వరకు కాగితం, స్లిప్పులు, ఓటింగ్ రోజు మాక్ పోలింగ్ ప్రక్రియకు వాడుతారు. అందుకే ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1400 ఓటర్లు మాత్రమే ఉండేలా చూస్తారు.

నాడు చెల్లని ఓట్లు- నేడు నోటా ఓట్లు


- మార్చనున్న అభ్యర్థుల తలరాత



రణస్థలం: ఈవీఎంలు రాకముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగేది. బ్యాలెట్ పేపర్‌పై ఉన్న గుర్తులను సరిగా చూసుకొని ఓటరు తన ఇష్టమైన గుర్తుపై ఓటేసేవారు. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్‌లో అక్కడక్కడ ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న ఉద్దేశంతో ఈవీఎంలను ప్రవేశపెట్టారు. నిరక్షరాస్యులు, వృద్ధులు బ్యాలెట్ పత్రంపై ఓటేసేటప్పుడు సరైన అవగాహన లేని కారణంగా స్వస్తిక్ ముద్రను సరిగా వేసేవారు కాదు. దీంతో అలాంటి ఓట్లను చెల్లని ఓట్లుగా పరిగణించేవారు. ఈవీఎంలు వచ్చిన తర్వాత అలాంటి సమస్యలేనప్పటికీ, నోటా (పై వారిలో ఎవరూ కాదు) అనే అనే ఆప్షన్ ఇచ్చారు. బ్యాలెట్ పత్రంపై తెలియక చెల్లని ఓట్లు పోలైతే, ఈవీఎంల్లో అన్ని తెలిసినప్పటికీ నోటా ఓట్లు పోలవుతున్నాయి.

ఓటు హక్కు అందరూ వినియోగించుకోవాలి

18 ఏళ్ల నిండిన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు రాజ్యాంగం ప్రసాదించింది. ప్రతి ఓటరు తమ హక్కును వినియోగించుకోవాలి. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్, మేధావులు, రాజకీయ పార్టీలు పదే పదే చెబుతుంటాయి. ఒక్కో నియోజకవర్గంలో చాలా మంది ఎన్నికల బరిలో ఉంటారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు ఓటేయడం ఇష్టం లేకపోతే చిట్టచివరన ఉన్న నోటా బటన్‌పై నొక్కితే సరిపోతుంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మొదటిసారిగా కేంద్ర ఎన్నికల సంఘం నోటాకు అవకాశం కల్పించింది.




విజేత మెజార్టీ కన్నా నోటా ఓట్లే ఎక్కువ..

గత ఎన్నికలను పరిశీలిస్తే విజయం సాధించిన అభ్యర్థి మెజార్టీ కంటే నోటా ఓట్లే ఎక్కువ పోలైన సందర్భాలు ఉన్నాయి. గతంలో రాజస్థాన్, ఢిల్లీ, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, మిజోరాం తదితర రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడక్కడ విజేత మెజార్టీ కంటే నోటా ఓట్లు ఎక్కువగా పోలవ్వడం చర్చనీయాంశమైంది. నాడు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరిగేటప్పుడు చెల్లని ఓట్లు, నేడు ఈవీఎం పద్ధతిలో నోటా ఓట్లు అభ్యర్థుల తలరాతను మారుస్తున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. గత ఎన్నికల్లో సుమారు ఒక శాతం నోటాకు ఓటర్లు ఓటేశారు.

ప్రచురణకర్తలూ..

తస్మాత్ జాగ్రత్త



- నిబంధనలు ఉల్లంఘిస్తే కోర్టును ధిక్కరించినట్లే
- ప్రచారంలో మార్గదర్శకాలపై ఈసీ ఉత్తర్వులు జారీ

హిరమండలం: ఎన్నికలు అనగానే అన్నిపార్టీలు ప్రచారానికి అధిక ప్రాధాన్యం ఇస్తాయి. ఓటర్లను ప్రభావితం చేసి తమ వైపు తిప్పుకోవడం కోసం మేనిఫెస్టో ప్రకటించి చేయబోయే పనులు, హామీలు గుప్పిస్తాయి. దీనికితోడు గతంలో నెరవేర్చిన వాగ్దానాలను కూడా ప్రచారాస్త్రాలుగా మార్చుకుంటాయి. దీనికోసం కరపత్రాలు, ఫ్లెక్సీలు ముద్రిస్తాయి. ఈ నేపథ్యంలో ప్రచారం తాలూకా ప్రచురణపై కొన్నిమార్గదర్శకాలు ఈసీ జారీచేసింది. ఈ విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్టం-1951 సెక్షన్-127 ప్రకారం విధించిన నిబంధనలను ఉల్లఘిస్తే కోర్టుని ధిక్కరించినట్లే భావిస్తారు. ఎటు వంటి తేడా వచ్చినా చట్టప్రకారం కేసు నమోదుచేస్తారు. జిల్లాలో ఇప్పటికే ప్రచారం జోరందుకుంది. రాష్ట్ర నాయకత్వం పంపించిన ప్రచార సామగ్రికి అభ్యర్థులు తయారు చేసుకుంటున్న ప్రచార సామగ్రి తోడవుతోంది. ఈ నేపథ్యంలో ప్రచురణలపై, ఎన్నికల సంఘం వెలువరించిన ఉత్తర్వులపై కథనం.

- గోడపత్రికలు, ఫ్లెక్సీలు, కరపత్రాలు ముంద్రించేవ్యక్తి (ప్రచురణకర్త) డిక్లరేషన్ తాలూక రెండు ప్రతులను తనకు వ్యక్తిగతంగా తెలిసిన ఇద్దరు వ్యక్తుల సంతకాలతో ప్రింటర్‌కు ఇవ్వాలి. డిక్లరేషన్ నమూనాను ఆయా నియోజకవర్గ ఎన్నికల అధికారి నుంచి పొందాలి.
- ముద్రణ పూర్తయ్యాక డిక్లరేషన్ తాలూక ఒక ప్రతిని ముద్రించిన ప్రతితో జతచేసి రాష్ట్ర రాజధాని అయిన పక్షంలో ప్రధాన ఎన్నికల అధికారికి, జిల్లా కేంద్రంలో అయితే జిల్లా కలెక్టర్‌కు అందజేయాలి.
- ఏ రాజకీయ పార్టీ అయినా, పోటీ చేసే అభ్యర్థి అయినా ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆరు నెలలు జైలు లేదా రూ. 2వేలు జరిమానా లేదా రెండూ విధించే అవకాశాలు ఉన్నాయి.
- పత్రికల్లో ప్రత్యేకంగా ఒక రాజకీయ పార్టీకి లేదా అభ్య ర్థులకు అనుకూలంగా వచ్చే వార్తా కథనాలు, సంపాదకీయాలు తదితర వాటిపై నిశిత పరిశీలిన చేయడానికి ఎన్నికల సంఘం సూచనలు జారీ చేసింది.
- ప్రజా ప్రాతినిధ్యచట్టం-1951లోని సెక్షన్ 77(1) ప్రకారం ఈ కథనాలకు అయ్యే ఖర్చును సైతం రాజకీయ పార్టీలు,పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయ ఖాతాలో నమోదు చేసే అవకాశముంది.
- ఒకవేళ అభ్యర్థి అనుమతి లేకుండా ప్రకటనలు, వార్తా కథ నాలు ముద్రిస్తే ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 171 హెచ్ ప్రకారం చర్యలు తీసుకుంటారు.
- పత్రికల్లో ఎన్నికల ప్రచారానికి సంబంధించి ప్రత్యేకంగా ఏ అభ్యర్థిపక్షానైనా ప్రకటనలు ఇచ్చేందుకు లేదా ఏ అభ్యర్థిపై వ్యతి రేకంగా ప్రకటనలు ఇచ్చేందుకు ముద్రించే వారి పేరు (ప్రచురణ కర్త), ముద్రించిన ప్రకటన ప్రతిని సమర్పించాలి.

జన కేతనం
ఆంధ్రజ్యోతి
ఆదివారం 21 ఏప్రిల్ 2024


నత్తనడకన సాగుతున్న ఫిషింగ్ హార్బర్ పనులు

- గత ఏడాది 19న ఫిషింగ్ హార్బర్‌కు శంకుస్థాపన
- బుడగట్లపాలెం వద్ద నిర్మిస్తామని ముఖ్యమంత్రి జగన్ హామీ
- ఆతర్వాత పట్టించుకోని వైసీపీ పాలకులు
- మత్స్యకారులకు తప్పని కష్టాలు

వైసీపీ ప్రభుత్వం చేసింది తక్కువ.. గొప్పలు చెప్పుకోవడం ఎక్కువ అన్నట్లు పరిస్థితి ఉంది. ఎంతో ఆర్భాటంగా శంకుస్థాపన చేసిన బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులకు అతీగతి లేదు. ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 18 నెలల్లో పూర్తిచేస్తామని చెప్పి గాలికొదిలేసింది. ఫలితంగా మత్స్యకారులకు వలసలే శరణ్యమయ్యాయి. ఇతర రాష్ట్రాలకు వెళ్లి పడరాని పాట్లు పడుతున్నారు. కేవలం ఓట్లు కోసమే బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులకు ప్రభుత్వం శంకుస్థాపన చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదైంది సీఎం సార్!

(రణస్థలం)

గతేడాది ఏప్రిల్ 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లాలోని మూలపేట వద్ద పోర్టు నిర్మాణ శంకుస్థాపనకు వచ్చారు. పనిలో పనిగా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కూడా వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఆ రోజు విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల శాసనసభ్యుడు గొర్లె కిరణ్‌కుమార్ చేతుల మీదుగా బుడగట్లపాలెంలో భూమి పూజ నిర్వహించారు. జిల్లాలోని మూలపేట వద్ద పోర్టు నిర్మాణ శంకుస్థాపనకు రూ.365.81 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ హార్బర్ పనులు పూర్తయితే బతుకులు బాగుపడతాయని మత్స్యకారులు ఎంతో ఆశపడ్డారు. 18 నెలల్లో పనులు పూర్తిచేస్తామని ఎంతో ఆర్భాటంగా ప్రకటించారు. ఇది కేవలం ప్రకటనలకే పరిమితమైంది. హార్బర్ పనులు నత్తనడకగానే సాగుతున్నాయి. దీంతో మత్స్యకారులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

సౌకర్యాలు సున్నా..

జిల్లాలో సుదూర తీర ప్రాంతం ఉన్నప్పటికీ, చేపల వేటకు అనుకూలమైన పరిస్థితులు లేవు. దీంతో జిల్లాలోని మత్స్యకారులు గుజరాత్, కర్ణాటక తదితర ప్రాంతాలకు ప్రతి ఏటా సీజన్‌లో చేపల వేటకు వలసపోతున్నారు. గుజరాత్‌లో ప్రతి 10 కిలో మీటర్లు పొడవునా తీరం వెంబడి జెట్టీలు ఉన్నాయి. అయితే ఈ జిల్లాలో జెట్టీలు, హార్బర్‌లు లేకపోవడంతో మత్స్యకారులు చేపల వేటకు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. పరాయి రాష్ట్రాలకు చేపల వేటకు వలసపోయే మత్స్యకారులు అక్కడ కూడా చాలా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొవిడ్ సమయంలో గుజరాత్, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకునేందుకు ఈ ప్రాంత మత్స్యకారులు పడిన పాట్లు వర్ణనాతీతం. ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తయితే తప్ప మత్స్యకారుల వలసలకు బ్రేక్ పడే పరిస్థితి లేదు.

మత్స్యకార ఓట్లకు వల

జిల్లాలో ఎచ్చెర్ల, శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో సముద్ర తీరం ఉంది. తీర ప్రాంతాల్లో నివసించే మత్స్యకారులు చేపల వేటకు సరైన సౌకర్యాలు లేవు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల విజయావకశాల్లో మత్స్యకార ఓట్లు కూడా కీలకంగా చెప్పొచ్చు. దీంతో మత్స్యకారులను ప్రసన్నం చేసుకునేందుకు వైసీపీ ప్రభుత్వం బుడగట్లపాలెం వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం పూర్తిచేసింది. ఈ నియోజకవర్గంలో రణస్థలం, ఎచ్చెర్ల మండలాల్లో మత్స్యకారులు 15 వేల మందికి పైగానే ఉన్నారు.

పనులు చేపట్టడంలో జాప్యం



సాధారణ ఎన్నికలకు ఏడాది ముందుకు స్వయంగా సీఎం వర్చువల్ విధానంలో బుడగట్లపాలెం వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన పూర్తయి ఏడాదైనా ఇప్పటికీ పనులు నత్తనడకగానే జరుగుతున్నాయి. హార్బర్ పూర్తయితే మత్స్యకారులకు ఎంతో మేలు జరుగుతుంది.

- అల్లుపల్లి రాంబాబు, సర్పంచ్, బుడగట్లపాలెం

పనులు ప్రారంభమయ్యాయి

బుడగట్లపాలెం సముద్రతీరంలో ఫిషింగ్ హార్బర్ పనులు ప్రారంభమయ్యాయి. గ్రావెల్ రోడ్లు, ఇతర పనులు జరుగుతున్నాయి. నిర్దేశించిన సమయంలో పనులు పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

- ఎస్.ముసలినాయుడు, ఎఫ్‌డీవో


బుడగట్లపాలెం తీరంలో హార్బర్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ (ఫైల్)


ఓట్లు వేయించుకున్నారు.. పనులు మరిచారు..

- పూడిలంకకు రోడ్డు వేస్తామని గతంలో వైసీపీ నేతల హామీ
- తీర్మానం మేరకు ఆ పార్టీకే ఓట్లు వేసిన గ్రామస్థులు
- గెలిచిన తరువాత పట్టించుకోని వైనం

మీ గ్రామానికి రోడ్డు వేస్తామని వైసీపీ నాయకులు చెప్పడంతో ఆ గ్రామస్థులు నమ్మారు. అంతా కూడగట్టుకుని మరి ఆ పార్టీకి గత ఎన్నికల్లో ఓట్లు వేశారు. తీరా గెలిచిన తరువాత వైసీపీ నేతలు పత్తాలేకుండా పోయారు. ఐదేళ్లుగా పట్టించుకున్న పాపాన పోలేదు. ఈసారి నమ్మమని ఖరాకండిగా చెబుతున్నారు పూడిలంక గ్రామస్థులు. ఈ రోడ్డు వేసేందుకు టీడీపీ అభ్యర్థి శిరీష హామీ ఇవ్వడంతో ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేసేందుకు తీర్మానం చేస్తామని గ్రామస్థులు చెప్పారు.

(వజ్రపుకొత్తూరు)

ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయ పార్టీల నాయకులకు పూడి లంక గ్రామం గుర్తొస్తుంది. ఏ ఎన్నికలు జరిగినా ఆ గ్రామస్థులు సమావేశమై తీర్మానం మేరకు ఒకే పార్టీకి ఓటును వేస్తారు. అయితే ఈ గ్రామానికి ప్రధానంగా రహదారి సమస్య వేధిస్తోంది. చుట్టూ ఉప్పుటేరు పారుతుండడంతో గ్రామానికి చేరుకోవడానికి పూర్తిస్థాయిలో రహదారి లేకపోవడంతో గ్రామస్థులకు ఇబ్బందులుతప్పడంలేదు. చిన్న గట్టు వంటి రహదారి వర్షాలకు తరచూ కొట్టుకుపోతుండడంతో గ్రామస్థులు వర్షాకాలంలో అగచాట్లకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి పూర్తిస్థాయిలో రహదారిని నిర్మించాలని నాయ కులకు ప్రతి ఎన్నికల్లో డిమాండ్ చేస్తునే ఉంటారు. గతంలో టీడీపీ హయాంలో రహదారి నిర్మాణానికి రూ. కోటి 30 లక్షలు మంజూరైనా 75 శాతం మాత్రమే పనులు జరిగాయి. ఇంతలో 2019లో వైసీపీ నాయకులు ఇచ్చిన హామీతో తీర్మానం మేరకు ఆ పార్టీకే ఓటువేసినట్లు గ్రామస్థులు చెప్పారు. అయితే ఐదేళ్ల కాలంలో రహదారి నిర్మాణానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. ఇటీవలే పలాస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌతు శిరీషను కలిసి తమ సమస్యను గ్రామస్థులు వివరించారు. తమ పార్టీ ప్రభుత్వం ఏర్పడితే రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని హామీతీసుకున్నారు. దీంతో గ్రామంలో సమావేశం ఏర్పాటుచేసి తీర్మానిస్తామని వారు పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లోనైనా రోడ్డు సమస్య పరిష్కారమవుందని గ్రామస్థులు ఆశిస్తున్నారు.


కొట్టుకుపోయిన పూడిలంక రహదారి

ధర్మాన సారూ.. ఈ రోడ్డు చూశారా?

- రాళ్లు తేలిన హుకుంపేట రహదారి
- నాలుగేళ్లుగా ప్రజలు నరకం
- సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్న పాలకులు



(గార)

రాళ్లు తేలిన ఈ రోడ్డును చూసి ఏదో మారుమూల ప్రాంతానికి వెళ్లే దారి అనుకుంటే పొరబడినట్లే. సాక్షాత్తు మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని గార మండలం హుకుంపేట గ్రామానికి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు ఇది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు రాళ్లు తేలిపోయి అధ్వానంగా తయారైంది. కనీసం నడవడానికి కూడా వీలులేకుండా మారింది. శ్రీకాకుళం-కళింగపట్నం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి హుకుం పేట గ్రామానికి వెళ్లే ఈ రహదారి అభివృద్ధికి నోచుకోవడం లేదు. సుమారు 1.23 కిలో మీటర్ల దూరం గల ఈ రోడ్డు మరమ్మతులకు ఉపాధి పథకం కింద నాలుగేళ్ల కిందట రూ.1.10 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో అప్పుడే పనులు ప్రారంభించారు. మొదట్లో చురుగ్గా చేశారు. అయితే, కాంట్రాక్టర్‌కు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో గ్రావెల్, మెటల్ వేసి రోలింగ్ చేసి వదిలేశారు. ఆ తరువాత ఈ పనులు నిలిచిపోవడంతో ప్రభుత్వం నాన్ ప్రయారిటీ కింద రద్దు చేసింది. దీంతో పలుదఫాలుగా స్థానికులు మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి రోడ్డు విషయాన్ని తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో నాలుగు నెలల కిందట అధికారులు రూ.25 లక్షల వ్యయంతో 500 పొడవునా సిమెంట్ రోడ్డు వేసేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. అయితే, ఇంత వరకూ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. ఉపాధి పథకం కింద మంజూరైన ఈ నిధులతో సిమెంట్ రోడ్డు పనులు చేపట్టడానికి పంచాయతీ ఆమోదం పొందాలి. పనులు చేసిన తరువాత బిల్లులు సకాలంలో చెల్లింపులు జరగకపోతే ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని భావించి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఈ విషయమై మండల ఇంజనీరింగ్ అధికారి నక్క చక్రధర్‌రావు మాట్లాడుతూ.. 'రోడ్డు పనులు పంచాయతీ ఆమోదంతో చేపట్టాల్సి ఉంటుంది. నామినేటెడ్ పనిగా చేయవచ్చు. కాంట్రాక్టరు ఎవరైనా ముందుకు వస్తే తగిన చర్యలు తీసుకుంటామని' తెలిపారు.

పసుపెక్కిన నరసన్నపేట

- అట్టహాసంగా టీడీపీ అభ్యర్థి బగ్గు నామినేషన్


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



నరసన్నపేట టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి నామినేషన్ కార్యక్రమం శనివారం అట్టహాసంగా జరిగింది. నియోజవర్గంలోని నాలుగు మండలాల నుంచి వచ్చిన శ్రేణులతో నరసన్నపేట పసుపెక్కింది. పైడితల్లి ఆలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నామినేషన్ ర్యాలీలో మహిళ కార్యకర్తలు డ్యాన్సులతో సందడి చేశారు. బాణసంచా మోతతో పేట దద్దరిల్లింది. జమ్ము జంక్షన్, గొట్టిపల్లి జంక్షన్, ఈదుల వలస జంక్షన్, కోమర్తి జంక్షన్ వరకు వచ్చే కార్యకర్తలతో వాహనాలు బారులు తీరాయి. ● నరసన్నపేట హోడ్కోకాలనీ చెందిన టీడీపీ అభిమాని గోపి పసుపు వస్త్రాలు ధరించి సైకిల్ నిండా పార్టీ జెండాలు కట్టి, తాను కూడా పసుపు వస్త్రాలు ధరించాడు. జెండాలతో పట్టణంలోని పలువీధుల్లో ప్రచారం చేశాడు.

- నరసన్నపేట

మా ఓటు మీకే

- ఏ పార్టీ పిలిచినా సభలకు వెళ్తున్న ప్రజలు
- అభ్యర్థుల్లో అయోమయం



వజ్రపుకొత్తూరు: ఎన్నికల వేళ ప్రస్తుతం గ్రామాల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. కొంతమంది ఏ పార్టీ నాయకులు పిలిచినా ర్యాలీలు, ప్రచారానికి మద్దతుగా తిరుగుతున్నారు. ఈ విషయంపై ఎదుట పార్టీ నాయకులు ప్రశ్నిస్తే ఇంటికి వచ్చి పిలిచారు.. కానీ మా ఓటు మాత్రం మీ పార్టీకే బాబు అని సమాధానం చెబుతున్నారు. దీంతో ఆటువంటి వారంతా ఎవరికి ఓటు వేస్తారోనన్న అయోమయం అభ్యర్థుల్లో నెలకొంది. గత ఎన్నికల వరకూ లేని విచిత్ర పరిస్థితి ప్రస్తుత ఎన్నికల్లో నెలకొనడంతో గ్రామాల్లో ఓటర్ల నాడి పట్టలేక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. గత సార్వత్రిక ఎన్నికల వరకూ ఏ పార్టీకి మద్దతు ప్రకటిస్తే ఆ పార్టీతోనే ఉండేవారు. ఎన్నికల రోజు కూడా శిబిరాల్లో ఉత్సాహంగా ఉండి ఓటర్లకు ఆకట్టుకునే ప్రయత్నం చేసేవారు. ఏ పార్టీకి బహిరంగంగా మద్దతు ప్రకటించిన వారు మాత్రం చివరి వరకూ ఎవరితోనూ తిరగకుండా ఓటింగ్ రోజున తనకు నచ్చిన వారికి ఓటు వేసేవారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు ఎటువంటి ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశంతోనే ఈ పరిస్థితి నెల కొందని గ్రామాల్లో ఎటువంటి ప్రకటనలు చేయడంలేదు. ఇటువంటి జాబితాలో ఇప్పుడు పురుషులతో పాటు మహిళలు కూడా చేరిపోయారు. ఇప్పటికే గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కిన నేపథ్యంలో గ్రామాల్లో కూడా ప్రచారాలు ఊపందుకున్నాయి. టీడీపీ, వైసీపీ నాయకుల ప్రచారం పోటాపోటీగా గ్రామాల్లో అర్ధరాత్రి వరకూ సాగుతోంది. అభ్యర్థులు గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో ఘనంగా ఆహ్వానం పలకాలన్న ఉద్దేశంతో గ్రామస్థాయి నాయకులు ముందు రోజే ఇంటింటి వెళ్లి తమ నాయకుని ప్రచారానికి రావాలని కోరుతున్నారు.దీంతో ఆహ్వానాలు మన్నించిన కొంతమంది నాయకుల ప్రచారాలకు బహిరంగంగా వెళ్లి మద్దతు పలికి వారితో ర్యాలీలు, ప్రచారాల్లో పాల్గొంటున్నారు. 'గ్రామాల్లో మా కంటే మాకే మెజార్టీ వస్తుందని' నాయకులు ప్రచారం చేసుకుంటున్నా, రెండు పార్టీల వైపు తిరిగే వారి వల్ల లోలోపల ఆందోళన చెందుతున్నారు. సర్వేలు చేసేవారు కూడా ఇటువంటి వారిని ప్రశ్నిస్తే పార్టీలది ఏముంది ఎన్నికల రోజున మాకు ఇష్టం వచ్చిన వారికి ఓటు వేస్తాం, అంతవరకూ ఏ ఒక్క పార్టీ నాయకులకు చెడ్డ కాకుండా ఉండకూడదు కదా అని సమాధానాలు చెబుతున్నారు. మొత్తం మీద ఇటువంటి గోపిలు రాజకీయ నాయకులు అంతుపట్టడంలేదు.

దువ్వాడ వాణికి బుజ్జగింపులు

టెక్కలి: టెక్కలి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా ఈ నెల 22న నామినేషన్ వేస్తున్నట్లు ప్రకటించిన వైసీపీ నాయకురాలు, టెక్కలి జడ్పీటీసీ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను సతీమణి దువ్వాడ వాణిని అధిష్ఠానం బుజ్జగిస్తోంది. ఈ మేరకు వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్ చిన్న శ్రీను, వైసీపీ నియోజకవర్గ పరిశీలకులు కాయల వెంకటరెడ్డి.. వాణిని పిలిపించి నచ్చజెబుతున్నారు. నామినేషన్ వేస్తే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని ఆమెకు చెబుతున్నారు. ఓవైపు వైసీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ కిల్లి కృపారాణి నామినేషన్ వేయడం, మరోవైపు దువ్వాడ వాణి కూడా నామినేషన్ వేస్తానని ప్రకటించడంతో వైసీపీలో వణుకుమొదలైంది. అందుకే వాణిని పిలిచి నచ్చజెబుతున్నారు. ఆమె ఈ నెల 22న నామినేషన్ వేస్తారా, అధికార పార్టీ నాయకుల బుజ్జగింపులకు తలొగ్గుతారా లేదా అన్నది వేచిచూడాలి.

కళాకారులకు ఉపాధి

- ప్రచారం కోసం రాజకీయ పార్టీల వినియోగం

పలాస: ఎన్నికలు వచ్చాయంటే కళాకారులకు పండగే. వారికి రోజంతా ఉపాధితోపాటు చేతినిండా డబ్బులు దొరుకుతాయి. దీంతో వారంతా రాజకీయ నాయకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పలాస ప్రాంతంలో తప్పెటగుళ్ల, తీన్‌మార్, డప్పు, బ్యాండ్‌మేళా కళాకారుల కుటుంబాల 100 వరకూ ఉన్నాయి. ఏ పార్టీ ప్రచారం చేసినా వీరినే సంప్రదిస్తున్నారు. ఎన్నికలు వచ్చాయంటే మావంటి వారికి ఉపాధి లభిస్తుందని రేగులపాడుకు చెందిన తప్పెటగుళ్ల కళాకారుడు పీతగంగయ్య తెలిపారు.



హైదరాబాద్‌కు చెందిన గ్రానైట్ వ్యాపారి అదృశ్యం



టెక్కలి: తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్ గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన కాలే సుబోధి శుక్రవారం సర్వే నెం.73 మేలి సతివాడ పరిధి ఆవుల వేణుగోపాల్‌కు చెందిన గ్రానైట్ క్వారీ పరిశీలనకు వచ్చిన కొంతసేపటి తరువాత అదృశ్యమయ్యారని తెలంగాణాకి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ పైడయ్య సిబ్బందిని పంపి ఆ ప్రాంతంలో గాలించినా సుబోధి ఆచూకీ లభించలేదు. క్వారీ పరిశీలన అనంతరం ఆయన అదృశ్యమయ్యారని, శనివారం ఉదయం 10.30 గంటల వరకు ఆయన వద్దనున్న ఫోన్ రింగ్ అయిందని వారి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సుబోధి తన స్నేహితుడు వెంకటేశ్వర్లుతో ఈ ప్రాంతంలో క్వారీని లీజుకు తీసుకునేందుకు పరిశీలనకు వచ్చి అదృశ్యమైనట్లు తెలు స్తుంది. ఈ మేరకు సీఐ పైడయ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గొల్లవీధికి చెందిన యువకుడు..



టెక్కలి: టెక్కలి గొల్లవీధికి చెందిన వాకాడ రాంబాబు వారం రోజులుగా కనిపించడం లేదని తండ్రి కామేసు టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాంబాబు టెక్కలిలో రైలు ఎక్కి నౌపడాలో దిగి నౌపడా నుంచి రైలు ఎక్కి హైదరాబాద్ ప్రాంతానికి చేరుకున్నాడని తండ్రి ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీలోకి నాలుగు మండలాల వైసీపీ కార్యకర్తలు



టీడీపీలో చేరిన వారితో అచ్చెన్నాయుడు

టెక్కలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో శనివారం నాలుగు మండలాల నుంచి 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. టెక్కలి మండలం రావివలసకు చెందిన వార్డుమెంబర్ నర్తు గంగాధర్, బృందావనం గ్రామానికి చెందిన అప్పిన తారకేశ్వరరావు తదితరులు, నందిగాం మండలం సింగుపురానికి చెందిన తుంగాన తిరుపతిరావు తదితరులు, కోటబొమ్మాళి మండలం గురివెల్లిపేటకు చెందిన చింతాడ శ్రీనివాస్ తదితరులు, సంతబొమ్మాళి మండలం లక్కివలస, గెద్దలపాడ గ్రామాలకు చెందిన నర్తు జనార్దన్ తదితర 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి అచ్చెన్నాయుడు కండువాలు కప్పి ఆహ్వానించారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఈనెల 22న నామినేషన్‌కి పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

● టెక్కలి మేజర్‌పంచాయతీ చేరివీధిలోని కిల్లిపోలమ్మ అమ్మవారిని శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు దర్శించుకున్నారు. నామినేషన్ వేసే ముందు అచ్చెన్నాయుడు అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. పూజారి పేట గోపి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నేతలు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, హను మంతు రామకృష్ణ, కోళ్ల కామేసు, కోళ్ల లవకుమార్, లాడి శ్రీనివాస్, మట్ట పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ సర్పంచ్..

కొత్తూరు: వైసీపీకి చెందిన సర్పంచ్ కృష్ణమూర్తి శనివారం టీడీపీలో చేరారు. ఈయనకు లోతుగెడ్డ తులసీవర ప్రసాదరావు కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు విజయానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాకవరం, కర్లెమ్మ ఎంపీటీసీలు చీకటి వీర్రాజు, వడ్డి గౌరీకుమార్, నేతలు లోతుగెడ్డ తాతబాబు, కూన అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

90 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారికి కండువా వేస్తున్న కూన రవికుమార్

ఆమదాలవలస: మండలంలోని మునగవలస, దూసిపేట గ్రామాల నుంచి 90 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరాయి. మునగవలసలో బగాది రామి నాయుడు తదితర 60 కుటుంబాలకు, దూసిపేటకి చెందిన 30 కుటుంబాలకు శనివారం టీడీపీ కూటమి అభ్యర్థి కూన రవికుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నూకరాజు, సనపల ఢిల్లీశ్వరరావు, పాత్రుని పాపారావు, కూటమి నాయకులు పాపారావు, పేడాడ రామ్మోహన్‌రావు, పైడి మురళీమోహన్, సూరపునాయుడు తదితరులు పాల్గొన్నారు. చీమల వలస గ్రామంలో రవికుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు.

పవన్ కల్యాణ్‌పై దువ్వాడ వ్యాఖ్యలు దారుణం

శ్రీకాకుళం రూరల్: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌పై ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చేసిన అనుచిత వ్యాఖ్యలు దారుణమని, ఈ ధోరణిని మార్చుకోవాలి జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ అన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరు లతో మాట్లాడుతూ.. దువ్వాడ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే వీధి రౌడీలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో దువ్వాడను ఓడించేందుకు జనసైనికులు, ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఎన్నికల హామీలేమయ్యాయి?

కాశీబుగ్గ: గత ఎన్నికల ముందు వంద హామీలిచ్చి అవి నెరవేర్చకుండా మరలా ఓట్లకోసం ఎలా వస్తారని మంత్రి సీదిరి అప్పలరాజును పలాస-కాశీబుగ్గ టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగ రాజు ప్రశ్నించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. 7వ వార్డు చినబాడాంలో పాత రౌడీషీటర్లు తిరిగి ప్రజలను బెదిరించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, గతంలో జరిగిన అల్లర్లు, గొడవలకు కారకులైన నిందితులకు మా ప్రభుత్వం రాగానే విచారణ చేపట్టి శిక్ష పడేలా ప్రజల తరఫున కోరతామన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

మునిసిపల్ పారిశుధ్య కార్మికులపై పనిభారం తగ్గించాలి

అరసవల్లి: శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులపై పని భారం తగ్గించాలని, కార్మికుల సంఖ్యను పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజే శ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.బలరాం, ఎ.గణేష్ కోరారు. ఈ మేరకు శనివారం కమిషనర్ తమీమ్ అన్సారియాను కలిసి కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందించారు. చెత్త సేకరించే వాహనాలకు కనీసం ఇద్దరు కార్మికులను కేటాయించాలని, వారికి సరిపడా పనిముట్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

ఆదిత్యాలయంలో విశేష హోమం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో శనివారం ఆగ్నేయ స్థాలీపాక హోమాదులు నిర్వహించారు. సాయంత్రం అర్చన, విశేష భోగాల సమర్పణ చేశారు. కార్యక్రమంలో ఈవో ఎస్. చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు. ● స్వామిని శనివారం ఎన్నికల పరిశీలకుడు నవీన్ కుమార్ సోని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు స్వాగతం పలుకగా స్వామి వారి జ్ఞాపికను ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, బీఎస్ చక్రవర్తి అందజేశారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి అభినందన

ఎచ్చెర్ల: శ్రీకాకుళం ఆర్జీయూకేటీ క్యాంపస్ విద్యార్థిని శ్వేత బాయ్ బాడవతు సినోప్సిస్ కంపెనీకి ఎంపికైనట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు. 2018-19 బ్యాచ్ విద్యార్థిని శ్వేతబాయ్ రూ.19 లక్షల ప్యాకేజీకి ఎంపికవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ గేదెల రవి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల సందర్శించిన నాక్ బృందం

ఇచ్ఛాపురం: రత్తకన్న వద్ద ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్ టీం శనివారం సందర్శించింది. విద్యార్థులతో మాట్లాడి పాఠాల బోధన, కంప్యూటర్ విద్య, ప్రాక్టికల్స్ ఇలా పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డుల తీరు, ప్రాక్టికల్స్ రూంలో ఉన్న పరికరాలు, సిబ్బంది వివరాలు సేకరించారు. నివేదికను బెంగుళూర్ నాక్ కార్యాలయానికి అందజేస్తా మని నాక్ చైర్మన్ డాక్టర్ పరమేంద్ర బాజ్‌పాల్ తెలిపారు. నాక్ బృందం కో ఆర్డినేటర్ డాక్టర్ జైదీప్ చౌదారి, సభ్యుడు హరిదాస్ విదాతీ, ప్రిన్సిపాల్ రాబిన్‌కుమార్ పాడి పాల్గొన్నారు.

ఘనంగా హాటకేశ్వరుని కల్యాణం

శ్రీకాకుళం రూరల్: సింగుపురం గ్రామంలో శనివారం హాటకేశ్వరుని ఆలయంలో పార్వతీ కొండమ్మ సమేత హాటకేశ్వరుని కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ అనువంశిక ధర్మకర్త సర్పంచ్ గుండ ఆదిత్యనాయుడు ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. **పోలాకి:** గొల్లలవలస, దీర్ఘాశి, మబగాం రామాలయాల్లో శ్రీరాముని కల్యాణం శనివారం కన్నుల పండువగా జరిగింది. ఆదివారం పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

అరసవల్లి/ఆమదాలవలస/పాతపట్నం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు పుట్టిన రోజు వేడుకలను శనివారం జిల్లాలో పలు ప్రాంతాల్లో నిర్వహించారు. శ్రీకాకుళం టీడీపీ జిల్లా కార్యాల యంలో ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి గొండు శంకర్, ఆమదాల వలస మండలం మునగవలసలో జిల్లా అధ్యక్షుడు, అభ్యర్థి కూన రవికుమార్, పాతపట్నంలో ఆ పార్టీ అభ్యర్థి మామిడి గోవిందరావు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అలాగే టెక్కలి, హరిపురం, కాశీబుగ్గల్లోనూ చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఉమ్మడి పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆమదాలవలస: కేక్‌ను కట్ చేస్తున్న రవికుమార్



అరసవల్లి: చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న గొండు శంకర్ తదితరులు



పాతపట్నం: నాయకులకు కేక్ తినిపిస్తున్న ఎంజీఆర్

ఎన్డీఏ కూటమిని గెలిపించండి: ఎంపీ

గార: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం శ్రీకూర్మంలో శ్రీకాకుళం అసెంబ్లీ అభ్యర్థి గొండు శంకర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు విసిగిపోయారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా గొండు శంకర్‌ను గెలిపించాలని కోరారు. శ్రీకూర్మంతో పాటు ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. శ్రీకూర్మం జంక్షన్ నుంచి బైక్ ర్యాలీ శ్రీకూర్మం గ్రామం వరకు సాగింది. కార్యక్రమంలో ఉమ్మడి పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు అడిగే అర్హత ధర్మానకు లేదు: శంకర్

అరసవల్లి: ఐదేళ్లలో మంత్రి ధర్మాన ప్రసాదరావు నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడలేదని, మరలా ఏ ముఖం పెట్టుకుని ఓట్ల కోసం ప్రజల ముందుకు వస్తారని, ఓట్లడిగే అర్హత ధర్మానకు లేదని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ ప్రశ్నించారు. నగరంలోని మంగువారితోటలో శనివారం ప్రజాగళం, సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తుపాకుల రవికుమార్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు దానం పూర్ణచంద్రరావులతో పాటు వంద కుటుంబాలు రోణంకి కల్యాణ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి శంకర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం అనంతరం 37, 38 డివిజన్లలో అంధవరపు శ్రీను ఆధ్వర్యంలో కంద్రవీధి, కామాక్షమ్మ నగర్ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఎంపీగా రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నేతలు చిట్టి నాగభూషణం, కొర్ను నాగార్జున ప్రతాప్, సతీష్ బాబా, అంబటి లక్ష్మీ రాజ్యం, పీవీరమణ, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.



దోశ వేస్తున్న టీడీపీ అభ్యర్థి గొండు శంకర్

టీడీపీ తీర్థం పుచ్చుకున్న 'డోల'

● జలుమూరు జడ్పీటీసీ మెండ విజయశాంతి, భర్త రాంబాబు కూడా..

● కండువాలు వేసి ఆహ్వానించిన ఎంపీ రామ్మోహన్, ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు



టీడీపీలో చేరిన డోల జగన్, జడ్పీటీసీ విజయశాంతిలకు కండువాలు వేస్తున్న ఎంపీ రామ్మోహన్, ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, ఏప్రిల్ 20: నరసన్నపేట నియోజకవర్గంలో పలువురు ముఖ్యనేతలు, కార్యకర్తలు వైసీపీని వీడి శనివారం టీడీపీలో చేరారు. డీసీసీబీ మాజీ చైర్మన్ డోల జగన్, జడ్పీటీసీ సభ్యురాలు మెండ విజయశాంతి, ఆమె భర్త రాంబాబుతో పాటు పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకోగా వారికి ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి కండువాలు కప్పి ఆహ్వానించారు. డోల జగన్ ఉమ్మడి అభ్యర్థి రమణమూర్తి నామినేషన్‌లో పాల్గొని టీడీపీలో చేరగా విజయశాంతి నామినేషన్ అనంతరం బగ్గు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తామంతా ఉమ్మడి అభ్యర్థులు ఎంపీ రామ్మోహన్ నాయుడు, బగ్గు రమణమూర్తి విజయానికి కృషి చేస్తా మని ప్రకటించారు. వైసీపీ అరాచక పాలనను అంతం చేసేందుకు అందరం కలిసికట్టుగా ముందుకు సాగి టీడీపీ విజయానికి పాటుపడతామన్నారు. కార్యక్రమంలో సారవకోట మండల నాయకులు ధర్మాన తేజ్‌కుమార్, పొన్నాన సీతారామ నాయుడు, కత్తిరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

24న నామినేషన్‌కు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఈనెల 24న నామినేషన్ వేయనున్నందున మూడు పార్టీల క్యాడర్ పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే బి.అశోక్ కోరారు. రామయ్య పుట్టుగలో శనివారం నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామం నుంచి పార్టీల నేతలు, కార్యకర్తలు తరలివచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం జగన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచాకాలకు చరమగీతం పాడేలా నామినేషన్ కార్యక్రమం ఉండాలన్నారు. అనంతరం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో మూడు పార్టీల నేతలు పాల్గొన్నారు.

శిరీష గెలుపే ధ్యేయంగా పనిచేస్తాం

● కాళింగ సంక్షేమ సంఘం అత్యవసర సమావేశం తీర్మానం




మాట్లాడుతున్న వజ్జ బాబూరావు

పలాస: గత 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి సీదిరి అప్పలరాజు గెలుపుకోసం కృషి చేశామని, ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష విజయం కోసం పాటుపడతామని పలాస నియోజకవర్గ టీడీపీ కాళింగ సామాజికవర్గం నేతలు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం టీడీపీ కార్యాలయంలో కాళింగ సామాజికవర్గం నాయకులు సమావేశమై మంత్రిని ఓడించడానికి తీర్మానించారు. సంఘ నేతలు మాట్లాడుతూ.. త్వరలోనే కార్యాచరణ ప్రకటిం చడం జరుగుతుందని, నియోజకవర్గంలో కాళింగులంతా శిరీషకు ఓటు వేయాలనే సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నేతలు మల్లా సూర్యనారాయణ, వజ్జ బాబూరావు, పిరియా రమణమూర్తి, దువ్వాడ హేమబాబుచౌదరి, కొర్ల కన్నారావు, వాయిలపల్లి మాధవరావు దువ్వాడ శ్రీకాంత్, బడ్డ నాగరాజు, దానేటి పద్మజీ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపనులకు అధిక ప్రాధాన్యం

ఎల్.ఎన్.పేట: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనలో కొత్త పనులకు ప్రాధాన్యం ఇచ్చి చేయించాలని ఉపాధిహామీ జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనులు చేయించాలన్నారు. ఏపీడీ పి.రాధ, ఏపీవోలు శ్రీదేవి, అరుణ్‌కుమార్, ఈసీ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



వంశధార కాలువను ఆధునికీకరించండి

వజ్రపుకొత్తూరు: వంశధార ఎడమ కాలువను ఆధునికీకరించాలని జనసేన పలాస సమన్వ యకర్త వి.దుర్గారావు కోరారు. శనివారం ఆ పార్టీ నాయకులతో కలిసి వంశధార కాలువను పరిశీలించారు. కాలువను ఆధునికీకరిస్తే మండలంలో 31 గ్రామాల్లోని 1026 ఎకరాలకు, పలాస మండలంలో 36 గ్రామాల్లోని 7992 ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. ఈ సమస్యపై వంశధార ఈఈని కలిసి వినతిపత్రం అందించనున్నానన్నారు.

వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజీనామా

నందిగాం: వైసీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతాడ శ్రీనివాసరావు ఆ పార్టీకి రాజీనామా చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీలపై చిన్నచూపు చూడ డమే కాకుండా సంక్షేమ పథకాలను రద్దుచేశారని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు ఆధ్వ ర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి సమక్షంలో ఆ పార్టీలో చేరినట్లు తెలిపారు.

నేటి నుంచి గ్రామదేవత ఉత్సవాలు

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలం సుభలయ కాలనీలో ఆదివారం నుంచి 30వ తేదీ వరకు నీలమణి అమ్మవారి గ్రామ దేవత ఉత్సవాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఘటాల ప్రదర్శన, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.



మెరుగైన సేవలందించడమే లక్ష్యం

● యూబీఐ విశాఖ జోనల్ హెడ్ షాలిని మీనన్



బ్యాంక్ శాఖను ప్రారంభిస్తున్న షాలిని మీనన్

శ్రీకాకుళం అర్బన్: ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని యూనియన్ బ్యాంక్ విశాఖపట్నం జోనల్ హెడ్ షాలిని మీనన్ అన్నారు. పెద్దపాడు రోడ్డు రామిగెడ్డ సమీపంలో శనివారం బ్యాంకు శాఖను ఆమె ప్రారంభించారు. 17 ఏళ్లుగా ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నామని, రూ.120 కోట్లతో బ్యాంకు లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 40 బ్రాంచ్‌లతో ఖాతాదారులకు సేవలు కొనసాగిస్తున్నామన్నారు. ఏటీఎంను ప్రారంభించారు. కార్యక్రమంలో విశాఖ డిప్యూటీ జోనల్ హెడ్ హెరాంప్, శ్రీకాకుళం రీజనల్ హెడ్ వెంకట తిలక్, బ్రాంచి మేనేజర్ ఇందిర ప్రియదర్శిని, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి



చిన్నారుల డ్యాన్స్ ప్రదర్శన

రణస్థలం: చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలని డీఈవో కె.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం సూర్య స్కూల్ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. పాఠశాల చైర్మన్ మణి మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో వై.త్రినాథరావు, డైరెక్టర్ సీహెచ్ వెంకటరావు, సీఆర్పీ యూ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి

ఆమదాలవలస: ఎన్నికల విధులను బాధ్యతతో సక్రమంగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, జేసీ ఎం.నవీన్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో పీవోలు, ఏపీవోలకు శిక్షణ నిర్వహించారు. ఈవీఎంల వినియోగం, ఎన్నికల విధులపై అవగాహన కలిగించారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న ఈవీఎంలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీ ల్దార్ కె.వేణుగోపాల్, ఎన్నికల డీటీ మురళీధర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శనివారం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో పీవో, ఏపీవోలకు ఎన్నికల శిక్షణ నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ ఎన్నికల రోజు నిర్వహించాల్సిన విధులపై సూచనలిచ్చారు. ఎన్నికల ఏర్పాట్లపై సిబ్బంది పక్కాగా అవగాహన కలిగివుండాలని సూచించారు.

కాశీబుగ్గ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 13న జరగనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పలాస ఆర్డీవో భరత్‌నాయక్ అన్నారు. కాశీబుగ్గలో శనివారం పీవో లు, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ సమయంలో జాగ్రత్తలు పాటించాలని, పోలింగ్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్ర మంలో తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట: ఎన్నికల విధులను సమర్థవంతంగా, సక్రమంగా నిర్వహించాలని ఆర్వో రామ్మోహన్‌రావు సూచించారు. శనివారం స్థానిక బోర్డు ఉన్నత పాఠశాలలో పీవోలు, ఏపీవో లకు శిక్షణ నిర్వహించారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించండి

మందస: సీపీఎం బలపర్చిన ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాయకురాలు పంచాది రోజా కోరారు. మందస బస్టాండు ఆవరణలో శనివారం సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.మోహనరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. హక్కు చట్టం రద్దు చేసి గిరిజన భూములకు రక్షణ లేకుండా చేసిందని విమర్శించారు. నేతలు పాల్గొన్నారు.

